08102024-DIS-04_Layout 1 10/8/2024 4:19 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

గాజా యుద్ధానికి ఏడాది

గాజాలో కొనసాగుతున్న యుద్ధానికి ఏడాది పూర్తయినా, పరిష్కారం మాత్రం కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దుస్సాహసిక దాడితో మొదలైన ఘర్షణ దీర్ఘకాలిక యుద్ధంగా మారింది. నిజానికి దీన్ని యుద్ధం అనే కన్నా ఇజ్రాయెల్ ఏకపక్షంగా జరుపుతున్న విధ్వంసం అనడం సబబు. హమాస్ మిలిటెంట్లు నిరుడు అక్టోబర్ 7న జరిపిన దాడుల్లో 1,200 మంది ఇజ్రాయెలీలు హతమయ్యారు. మరో 250 మందిని వారు బందీలుగా పట్టుకుపోయారు. అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ ఎదురుదాడులు మొదలుపెట్టింది. మొదట్లో క్షిపణులతో విరుచుకుపడిన ఇజ్రాయెల్ తర్వాత గాజాలోకి సైన్యాన్ని పంపి భూతల యుద్ధాన్ని మొదలుపెట్టిం ది. ఈ ఏడాది కాలంలో గాజా ముఖచిత్రమే మారిపోయింది. దాదాపుగా అక్కడి భవనాలన్నీ బూడిదయ్యాయి. ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 42 వేల మంది గాజా పౌరులు హతమయ్యారు. వారిలో మహిళలు, పసివాళ్లే అధికం. ఇదిలా ఉంటే అటు లెబనాన్‌లో మరో మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా.. హమాస్‌కు సంఘీభావంగా రాకెట్లు వేస్తుండటంతో అక్కడ కూడా ఇజ్రాయెల్ భూతల యుద్ధం మొదలుపెట్టింది. ఇవి రెండూ ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య పరోక్ష యుద్ధాలే. నేడో రేపో ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రత్యక్ష దాడికి దిగుతుందనే వార్తలు వస్తున్నాయి. అంటే ఏడాదిలో గాజా ఘర్షణ మూడు ప్రాంతాల యుద్ధంగా పరిణమించింది తప్ప, గాజా పౌరులకు ఉపశమనం అనేదే దక్కలేదు.

మొదట ఆక్రమణదారు, ఆపై అణచివేతదారుగా మారిన ఇజ్రాయెల్ వైఖరిపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతున్నది. ఆత్మరక్షణకు ఇజ్రాయెల్ ఇస్తున్న నిర్వచనమే అందుకు కారణం. గాజాలో దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అంతర్జాతీయ న్యాయస్థానంలో దక్షిణాఫ్రికా కేసు దాఖలు చేసింది. అమెరికా సహా పలు పశ్చిమ దేశాల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక ప్రదర్శనలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కొన్ని నెలల క్రితం అమెరికా వర్సిటీలు పాలస్తీనా అనుకూల భైఠాయింపులు, ధర్నాలతో దద్దరిల్లాయి. ఏడాదిలో ఇజ్రాయెల్ తన మొండి వైఖరితో ఏకాకిగా మారుతుండటం మనం చూస్తున్నాం. ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకం నిలిపివేయాలని ఫ్రాన్స్ నిర్ణయించడం గమనార్హం. మరికొన్ని దేశాలు ఇదే బాటన వెళ్లే సూచనలు కనిపిస్తూనే ఉన్నాయి. ఏకైక అగ్రరాజ్యం అమెరికా మాత్రం పాలస్తీనీయుల పట్ల ఓ పక్క సానుభూతి ప్రకటిస్తూనే ఇజ్రాయెల్ యుద్ధ సంసిద్ధతకు అన్నివిధాలా అండదండలు అందిస్తూ ఉన్నది.

2020లో అరబ్బు దేశాలు, ఇజ్రాయెల్ మధ్య ఓస్లోలో కుదిరిన ఒప్పందం పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పలేకపోయింది. అందుకు పాలస్తీనా సమస్యే కారణం. పాలస్తీనీయులకు అండగా నిలిచిన ఇరాన్ ఇప్పుడు ఇజ్రాయెల్‌కు బద్ధవిరోధిగా మారి, యుద్ధం అంచున నిలిచింది. గాజాతో మొదలైన సమస్య ఒకటి రెండు దేశాలకు పరిమితం కాదనేది వాస్తవం. యుద్ధం దేశాల మధ్య జరిగినా అందులో నలిగిపోయేది ఇరువైపులా ఉన్న సామాన్యులే. గూడు చెదిరి నిరాశ్రయులయ్యేదీ వారే. గాజాలో నిత్య నరకం అనుభవిస్తున్న ప్రజల పరిస్థితి వర్ణనాతీతం. ఇది మానవతావాదానికి, నాగరికతకు మచ్చగా నిలుస్తుంది. ఇప్పటికైనా పశ్చిమదేశాలు గాజా హననాన్ని ఆపేందుకు ముందుకు రావాలి. రెండు దేశాల సూత్రమే సరైన పరిష్కారమనే సత్యాన్ని చిత్తశుద్ధితో అంగీకరించాలి. ఇజ్రాయెల్‌తో సమానంగా మనుగడ సాగించే హక్కు పాలస్తీనీయులకూ ఉంది. దానిని గుర్తిస్తే గాజా కల్లోలానికి ముగింపు పలకడం సాధ్యమే.

అదే బీజేపీ కొంపముంచింది!

హర్యానాలో బీజేపీ ఓడిపోనున్నదని స్పష్టంగా తెలుస్తోంది. రాష్ట్రంలో కమలం పార్టీ పరిస్థితి దారుణంగా ఉంది. ఈ విషయం గురించి నేను మొదటి రోజు నుంచి చెబుతున్నా. కానీ, ఆ పార్టీ నేతలే పట్టించుకోలేదు. సీఎం నాయబ్ సింగ్ సైనీ చేతుల్లో బీజేపీ చచ్చిన పామును పెట్టింది. రాష్ట్రానికి కలుగుతున్న నష్టాన్ని ఆయన నిలువరించలేకపోయారు. అదే ఇప్పుడు బీజేపీ కొంపముంచింది.

- దిగ్విజయ్ చౌతాలా, జేజేపీ ప్రధాన కార్యదర్శి

ఒక సమస్య నోరు, రెండవది తీరు

తన ప్రతిభా సామర్థ్యాలతో పది నెలల క్రితం అధికారానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు, తీరు సరైనవి అయితే ఇంతకాలంలో ఎంతో మంచి పేరు తెచ్చుకునేవారు. పరిపాలనపై దృష్టి కేంద్రీకరించి, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తూ, తన స్థానాన్ని కూడా సుస్థిర పరచుకునేవారు. కానీ, ఆయన నోరు, తీరు రెండూ బాగా లేవు. ఇది సామాన్యుల నుంచి విజ్ఞుల వరకు అందరూ ఎత్తిచూపుతున్నారు. పాత లక్షణాలు పోయేందుకు కొంత సమయం పడుతుందిలే అనుకుని కొంతకాలం వేచిచూసిన వారు కూడా ఈ సరికి ఆశలు వదులుకున్నారు. తనలో ఆ ధోరణి పోకపోగా ఇటీవల మరింత రెచ్చిపోతున్నారు. అందుకు కారణం ఒత్తిడికి గురికావటమని, డెస్పరేషన్ అని ఏ మానసిక శాస్త్ర నిపుణుడిని అడిగినా చెప్తారు. మరి అటువంటి ఒత్తిడికి కారణమేమిటని విచారిస్తే, పరిపాలనలోని వైఫల్యాలు, వాటిపై ప్రజల నుంచి ఇతర వర్గాల నుంచి పెరుగుతున్న విమర్శలని కూడా ఎవరైనా చెప్పగలరు.

టంకశాల అశోక్

అసెంబ్లీ ఎన్నికలలో రేవంత్ నాయకత్వాన కాంగ్రెస్ గెలిచిన తొలి ఘడియలలో, తన చుట్టూ పార్టీ కార్యకర్తలు మోహరించి ఉండగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆ కార్యకర్తలను, వారితో పాటు అక్కడ లేనివారిని కూడా ఉద్దేశిస్తూ రెండు మాటలన్నారు. తాను అప్పటివరకు మాట్లాడిన తీరులో ఇక ముందు మాట్లాడలేనని, ఆ విషయం అందరూ అర్థం చేసుకోవాలని, ఇక ఆ భాషను ఆశించవద్దని అన్నారు. అప్పటివరకు మాట్లాడిన తీరు ఏమిటో ఆయన వివరించలేదు.

కానీ, అదేమిటో అందరికీ సుపరిచితమే గనుక వెంటనే ఓహో అనుకున్నారు. అయితే, అటువంటి భాషకు, దూకుడుకు మెచ్చి అలవాటు పడిన రేవంత్‌రెడ్డి బ్రాండ్ ఆధునిక శిష్య గణానికి, అటువంటి సాధు భాష ఎంతవరకు నచ్చిందో చెప్పలేము. అటువంటి సూక్ష్మస్థాయి (మైక్రో) రిపోర్టింగ్ జర్నలిజం మనకింకా రాలేదు. మామూలు పద్ధతిలో ఊహించాలంటే వారికది ఎంతమాత్రం నచ్చదు. అదెట్లున్నా, వారిని ఆయన ఎంతమాత్రం నిరాశపరచలేదన్నది ఇక్కడ గుర్తించవలసిన విషయం. ఎవరి కైనా పాత సంస్కృతిని వదిలించుకోవాలని నిజంగానే ఉన్నా, జీవిత నేపథ్యం నుంచి అలవడిన దశాబ్దాల అలవాట్లు గనుక అంత త్వరగా పోవు. అందుకు సమయం అవసరం. సదరు అలవాట్లను క్రమక్రమంగానైనా పోగొట్టుకుంటున్నారా లేదా అని అందరూ గమనిస్తారు. పోగొట్టుకుంటుంటే సంతోషిస్తారు. లేకుంటే మరొక మారు ఓహో అనుకుంటారు. పైన పేర్కొన్న మొదటి ఓహోకు, ఈ రెండవ ఓహోకు అర్థమేమిటో బహుశా చెప్పనక్కరలేదు. ఈ పదినెలల తర్వాత మాత్రం అందరూ ఈ రెండవ ఓహో అనుకుంటున్నారు.

ఎన్నికల ఫలితాలు వెలువడిన క్షణాలలో రేవంత్‌రెడ్డి, తను అంతవరకు మాట్లాడిన భాష ఉచితమైనది కాదని గ్రహించినందువల్లనే, ఇక పైన తన భాష గురించి అటువంటి విజ్ఞతతో కూడిన మాట చెప్పారు. ఆ భాష ఇకనుంచి ఉపయోగించవద్దని ఆయన తనకు తాను అనుకునే ఉంటారు కూడా. కానీ, విధి బలీయమైనది అన్నట్లు మనుషులకు గత సంస్కృతీ సంస్కారాలు కూడా బలీయమైనవి. వారు జీవితంలో ఏదైనా దశలో గత అవాంఛనీయ సంస్కృతిని వదులుకోవాలని, అది ఇకపై ఫలానా విధంగా ఉండాలని సంకల్పించుకున్నప్పటికీ, పాత కొత్తల మధ్య ఘర్షణ జరుగుతుంటుంది. ఆ ఘర్షణలో క్రమంగా కొత్తదానిది పైచేయి అవుతే ఆ వ్యక్తి సంకల్పం గొతమ బుద్ధునికి వలెనే బలమైనదని భావించాలి. అది ఆహ్వానించదగిన పరిణామక్రమం అవుతుంది. అందుకు భిన్నంగా ఒకవేళ పాతదానిదే పైచేయి అవుతున్నట్టు కనిపించే పక్షంలో ఆ వ్యక్తి సంకల్పం బలమైనది కాదని స్పష్టమవుతుంది. రేవంత్ రెడ్డి వలెనే. ఒక సారి ఆ విధంగా పాత సంస్కృతే గెలుస్తూ కొత్త సంకల్పమన్నది ఓడటం మొదలైతే, ఇక ఆ వ్యక్తికి నిష్కృతి లభించేది జీవితంలో ఏదో ఒక పెద్ద దెబ్బ తగిలితే మాత్రమే.

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలోనే, తన భాషలో మార్పును గురించి ఇచ్చిన మాటను మరిచి చేసిన వ్యాఖ్యలు అనేకం ఉన్నాయి గానీ, వాటిలో ఒకటి ఆయనకు దేశ మంతటా పేరును తెచ్చిపెట్టింది. అది, స్వయంగా తన ప్రభుత్వంలో కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి వారిది 'బీహార్ డీఎన్ఏ' అని వ్యాఖ్యానించటం. ఈ ఎలక్ట్రానిక్ యుగంలో అది నిముషాలలో ఢిల్లీతో సహా ఉత్తరాదికంతా, దానితో పాటు ఇతర రాష్ట్రాలకు వ్యాపించిపోయింది. అందరూ దిగ్భ్రాంతి చెందారు. రేవంత్ రెడ్డి పేరు అంతవరకు దేశంలో ఎక్కువగా తెలియదు. ఎన్నికలు గెలిచినాక అప్పుడప్పుడే వింటున్నారు. అటువంటిది ఈ వ్యాఖ్యతో ఒక్కసారిగా పేరుతో పాటు ఆయన నోటి తీరు కూడా తెలిసిపోయింది. ఒక మనిషి డీఎన్ఏ గురించిన ప్రస్తావన ఎవరైనా దూషణలో భాగంగా అలవోకగా చేయవచ్చుగానీ, అది చాలా సున్నితమైన ప్రస్తావన. అది విశ్లేషణాత్మకమైనది అయితే వేరే. కానీ, ఒక వర్గాన్ని ఉద్దేశించిన నిందాత్మక ప్రస్తావన. కనుకనే ఆ మాట తీవ్రంగా నొప్పించి దుమారం లేపింది. ఢిల్లీలో కాంగ్రెస్ వారు క్షమాపణాపూర్వకమైన స్వరాలలో సంజాయిషీలు ఇచ్చుకోవలసి వచ్చింది. మరి స్వయంగా ముఖ్యమంత్రి అందుకు క్షమాపణలు చెప్పి, తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని అన్నట్టయితే గుర్తులేదు.

> **అట్లా చేయటం సరైనదని కొత్త సంస్కారం చెప్తే, చేయనక్కరలేదని పాత సంస్కారం చెప్పిందేమో తెలియదు. సినిమాల్లో చూస్తుంటాము గదా, హీరో లేదా హీరోయిన్‌కు అద్దంలోని ప్రతిరూపం ఒకటి, తన మనసు మరొకటి చెప్పటం వంటిదన్న మాట. ఆ విధంగా చూడగా ప్రస్తుత సన్నివేశంలో పాత సంస్కృతే గెలిచిందన్న మాట. (ఒకవేళ ఆయన ఉపసంహరించుకొని ఉండి అది నేను గమనించకపోతే, ఈ మాటలు ఉపసంహరించుకున్నట్టు భావించి నన్ను క్షమించగలరు.)**

సమస్య ఎక్కడ వస్తున్నదంటే, రేవంత్‌రెడ్డి తన భాషను పది నెలలు గడిచినా మార్చుకోనకపోగా, వీధిలోని సామాన్యుడు సైతం ఈసడిస్తున్నా పైన పేర్కొన్న విధంగా తానిచ్చిన మాటను ఎంతమాత్రం నిలబెట్టుకోకపోగా, నానాటికి మరింత పరుషంగా, అసభ్యంగా మార్చుకుంటున్నారు. అట్లా డెస్పరేషన్‌తో తమ గొంతు చించుకున్నా ప్రజలపై ప్రభావం పడే దశ గడిచిపోయిందన్నది వేరే మాట. ఒకవేళ ఆ తరహా భాష తన ప్రత్యర్థులు ఉపయోగిస్తున్నారని కారణంగా వెదకదలచుకున్నా తను అందుకు భిన్నంగా వ్యవహరించి మంచి సంప్రదాయం నెలకొల్పాలి. అప్పుడు ఒత్తిడి ఎదుటి వారిపై పడుతుంది. స్వయంగా తమకు తామూగా, ప్రజాభిప్రాయ రూపంలో కూడా. అప్పుడు ఆయనకు ఔన్నత్యం లభిస్తుంది. కానీ ఇటువంటిదేమీ కన్పించటం లేదు. తను తన నోటి కారణంగా పలచన కావటం ఒకటైతే, వందరోజుల గడువుతో హామీల బాండ్ పేపర్లను ఇంటింటికీ తిరిగి ఇచ్చి కూడా వాటి అమలుపై మాట తప్పటం అందుకు తోడవుతున్నది. ఆయన తీరు అని పైన అన్నది ఇందుగురించే. తమ ఆరు గ్యారెంటీల పత్రాన్ని ఎవరూ చేతికి తీసుకుని ఒక్కొక్కటిగా లెక్కలు వేసినా, వంద రోజులు కాదు గదా ఈ పది నెలల కాలంలో జరిగిందేమిటో, జరగనిదేమిటో ఎవరైనా చెప్పగలరు. చెప్తున్నారు కూడా. అందుకు సంబంధించి ప్రజల వ్యాఖ్యలకు గాని, ప్రతిపక్షాల విమర్శలకు గాని ప్రభుత్వం వారు చేస్తున్నదేమిటి? రకరకాల బుకాయింపులు. ఈ విషయంలో మేధావులు అనబడేవారు ఏమీ మాట్లాడరని తెలిసిపోయిన ప్రజలకు, ఎందుకు మాట్లాడరో కూడా అర్థమైపోయినందున వారి సంగతి వదలి వేద్దాం. ప్రజలు కూడా వదలివేసినట్టున్నారు. మొన్నటి ఎన్నికలపుడు కాంగ్రెస్ ప్రచార రథాలకు జెండా లూపిన ఈ మేధావులు వచ్చే ఎన్నికలకు కూడా జండాలు ఊపేవరకు.

ప్రజలు గ్యారెంటీల గురించి మాత్రం మాట్లాడుతూనే ఉన్నారు. ఎందువల్ల? అవి అమలుకాకపోవటం వల్ల. అమలుపై ముఖ్యమంత్రి పదే పదే అలవోకగా, నిస్సంకోచంగా నిర్ధితిగా చెప్తున్న అబద్ధాల వల్ల. ఆయన తీరు అంటున్నది ఇది కావటం వల్ల. ఈ తెలుగు నేలపై ముఖ్యమంత్రులను మొదటినుంచి చూస్తూ వచ్చిన వారున్నారు. కానీ, రేవంత్‌రెడ్డి తరహా నోరున్నవారిని గాని, తెల్లవారిలేస్తే చాలు ఇన్నిన్ని అబద్ధాలు ఆడేవారిని గాని అవే అబద్ధాలు మళ్లీ మళ్లీ చెప్పేవారిని గాని చూడలేదు వారు. తనకు పరిపాలనానుభవం లేదు. ఆ మాట ఆయనే ఒప్పుకున్నారు గాని సమస్య అది కానక్కరలేదు. అనుభవం లేకుండా నేరుగా ముఖ్యమంత్రులైన వారు ఇతరులు కూడా ఉన్నారు. అందరికీ వెంటనే గుర్తుకువచ్చేది ఎన్టీఆర్. ఆయన పరిపాలన తీరు ఇట్లా ఎంతమాత్రం లేదే. నోటి విషయం వదిలి వేద్దాం. ఇద్దరి నేపథ్యాలు, సంస్కృతులు వేరు గనుక. తనకు పాలనానుభవం లేదని మొదటనే నిజాయితీగా అంగీకరించిన రేవంత్‌రెడ్డి ఒకవేళ అంతే నిజాయితీ చూపుతూ, పరిపాలనను నేర్చుకుంటూ, అందరి సహకారంతో ముందుకు సాగటానికి ప్రయత్నించినట్లయితే, అది కొంత కాలం పాటు నెమ్మదిగా సాగినా ప్రజలు అర్థం చేసుకుని ఓపిక పట్టేవారు, హర్షించేవారు.

> **కానీ, తను అట్లా చేయకపోగా రోజూ బుకాయింపులు, అబద్ధాలతో అనేక హామీల గురించి అసలేమీ మాట్లాడనైనా మాట్లాడక దాటివేతలతో, రెండురోజుల కొక డ్రామాతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలతో, ప్రతిపక్షాలపై నోరు చేసుకోవటంతో కాలం గడుపుతుండటం వల్ల అందుకు గల అవకాశాన్ని ఆయన తనకు తానే ఇన్ని నెలలుగా చెడగొట్టుకుని, ఇప్పటికీ అదే చేస్తున్నారు.**

ఇందుకు ఇటీవలి రెండు ఉదాహరణలను చూడండి. ఒకటి, హైడ్రా వ్యవహారం. రెండు, సినీ నటి సమంత, మరికొందరు నటులు, అక్కినేని నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు. జల వనరుల పరిరక్షణ, మూసీ ప్రక్షాళనలు రాజశేఖర్‌రెడ్డి కాలం నుంచి ఉన్న ఆలోచన. అవెంత ముఖ్యమైనవో కొత్తగా మళ్లీ చెప్పనక్కరలేదు. అటువంటి కార్యక్రమంపై ముందుగా మేధోమథనం, అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా సేకరించటం, పూర్తిస్థాయి ప్రణాళికారచన, దాని అమలుకు తగిన ఏర్పాట్లు, జాగ్రత్తలు, అన్నీ ప్రజల ముందు పారదర్శకంగా, ప్రజాస్వామికంగా ఉంచి వారి అభిప్రాయాలు తీసుకోవటం, ఇళ్లు, వ్యాపారాలు, పనులు కోల్పోయేవారికి ప్రత్యామ్నాయాలు, పరిహారాలు, దోషులైన అధికారులూ తదితరులపై చర్యలు, దేనికైనా ముందు మూసీ మురికి శుద్ధి, కాలుష్యాలు రాకుండా ఆపటం, మొదలైనవి అసలేపీ ఎంతమాత్రం లేకుండా, సర్వేలు ఎందుకో ప్రజలకు సమాచారం ఇవ్వకుండా, వివిధ శాఖల మధ్య సమన్వయమన్నదే లేకుండా, అకస్మాత్తుగా ఎర్ర మార్కింగులు, నోటీసులు ఇచ్చి సామాన్లయినా తీసుకునే అవకాశం ఇవ్వకుండా పోలీసులతో బెదిరింపులు, జేసీబీ కూల్చివేతలు, నోటీసులిస్తే కోర్టు నుంచి స్టే తెచ్చుకుంటారు, శని, ఆదివారాల్లోనైతే కోర్టులుండవు వంటి దుర్మార్గపు ఆలోచనలూ, ఈ తీరునంతా ఏమంటారో ముఖ్యమంత్రే ప్రజలకు నిజాయితీగా చెప్పాలి.

ఈ తరహా హైడ్రా అరాచకం రెండు నెలలకు పైగా సాగినంతకాలం, ప్రజల ఆందోళనను, రోదనను ఎత్తిచూపిన ప్రతిపక్షాలపైనే ఆయన దాడులు సాగించారు తప్ప తన పొరపాట్లను నిజాయితీగా గుర్తించి సరిదిద్దుకోలేదు. లక్షన్నర కోట్లెందుకో చెప్పటం లేదు. కాంగ్రెస్‌లోనే విమర్శలు ఎందుకో గ్రహించటం లేదు. అంతా జరిగిన వెనుక ఇప్పుడు తీరికగా, ఏ ఒక్కరినీ బాధ పెట్టం, పునరావాసానికి పూచీ మాది, ప్రతిపక్షాలు సూచనలివ్వాలి, ప్రత్యామ్నాయ ఉపాధికి కమిటీ, పరిహారాలిస్తాం, అందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ప్రజలు సహకరించాలి వగైరా మాటలు మాట్లాడుతున్నారు. ఒక పాలకునికి మొదటనే ఉండవలసిన వివేకమిది. కనీసం ఇప్పటికైనా, ఆయన ఏమి చేయగలరో జాగ్రత్తగా గమనించటం అవసరం. అదేవిధంగా, ధనికులు పేదల మధ్య వివక్ష మాపటాన్ని, ఫొటోల సాక్ష్యంగా బయటపడిన తమ వారి ఫాంహౌజ్‌లను కాపాడటాన్ని, ప్రతిపక్షాలలో సబితా ఇంద్రారెడ్డి కుమారుల వంటి వారికి ఫాం హౌజ్‌లు లేకున్నా ఉన్నాయనే తరహా దబాయింపులను, ప్రతిపక్షాలు తమ భూములూ నిధులూ ఇస్తే నిర్వాసితులకు ఇళ్లు కట్టిస్తామనే హాస్యాస్పదపు వాదనలను ఇప్పటికైనా ఆపివేయగలరేమో కూడా చూడాలి.

విశేషం ఏమంటే, 5వ తేదీన ఇవన్నీ మాట్లాడి తనది సానునయ వైఖరి అని చూపించదలచిన ముఖ్యమంత్రి, 24 గంటలు తిరిగేసరికి 6వ తేదీన అందుకు భిన్నంగా మాట్లాడారు. మూసీ పథకం ఎవరు అడ్డుపడినా ఆగదని, ప్రక్షాళన చేసి తీరుతామని, అక్కడి ప్రజలు మురికిలోనే బతకాలా, వారి పిల్లలు బాగుపడవద్దా అని తన షరామామూలు తరహాలో మరొక మారు విజృంభించారు. అది విని నవ్వు వచ్చింది. మూసీని ప్రక్షాళన చేయవద్దని, అక్కడి ప్రజలు, పిల్లల జీవితాలు బాగుపడవద్దని ఇంత వరకు ఒక్కరంటే ఒక్కరైనా అనలేదు. ఇళ్లూ, వ్యాపార స్థలాలు కోల్పోతున్న బాధితులు సైతం అనటం లేదు.

> **కానీ, ఆ ప్రక్షాళన ఒక సమగ్ర ప్రణాళిక ప్రకారం సవ్యంగా చేయాలంటున్నారు. అదంతా తెలిసి కూడా వదిలివేస్తున్న రేవంత్ రెడ్డి, తన వైఫల్యాలను దాచి పెట్టేందుకు, ప్రక్షాళనను ఎవరో వ్యతిరేకిస్తున్నారంటూ తనకు తానే విలన్లను సృష్టించుకొని వారిపై నీడల యుద్ధాలు చేస్తున్నారు. ఇది రాజకీయాలలో ఒక ఎత్తుగడే కానీ, దానికి కాలం చెల్లిందని ఆయన గ్రహించాలి. ఈ ధోరణి వల్ల తనకు తానే విలన్ అవుతున్నానని అర్థం చేసుకొని పద్ధతులు మార్చుకోవాలి.**

పోతే, విషయం సున్నితమైనది అయినందున ఎక్కువ రాసుకోలేము గానీ, సినిమా కళాకారులపై మంత్రి సురేఖ వ్యాఖ్యల గురించి దేశమంతటా విమర్శలు వెల్లువెత్తినా, స్వయంగా కాంగ్రెస్ హైకమాండ్ కూడా ఆందోళన చెందినా, నోరు విప్పి ఒకమాటైనా అనని రేవంత్‌రెడ్డి తీరు గురించి ఏమనుకోవాలి. తన నోటిదురుసు తనపు సంస్కృతే ఆమెకు ప్రేరణ కలిగించి, ధైర్యాన్ని కూడా ఇచ్చి ఉంటుందని ఎందుకు భావించకూడదు. మొత్తానికి ఈ విధమైన నోరు, తీరులతో ఆయన తెలుగువారి రాజకీయ చరిత్రలో నిలిచిపోయేట్లున్నారు. అందరికీ ఏదో ఒక ప్రాతిపదిక ఉండాలి కదా.

గోండు సూరీడు కుమ్రం భీం

జోడెఘాట్‌లో నాటి నిజాం బలగాలతో తలపడిన గోండు అమరవీరుడు కుమ్రంభీం చుట్టూ ఎన్నో కథనాలు, కల్పనలు అల్లుకున్నాయి. వాటిని ఛేదించే ప్రయాణంలో నేను భీం సతీమణి సోంబాయిని కలిసి మాట్లాడాను. అలాగే అప్పటి కలెక్టర్ (అవ్వల్ తాలూక్దార్) అబ్దుల్ సత్తార్ నివేదికలను పరిశోధించాను. వాటి ఆధారంగా రాసిన ఈ వ్యాసం ద్వారా కుమ్రంభీం వ్యక్తిత్వం, నాడు జరిగిన వాస్తవాలపై కొంత స్పష్టత వస్తుందని భావిస్తున్నాను.

ఎస్.ఎం.ప్రాణ్‌రావు
80089 50101

కుమ్రం భీం దాదాపుగా 1901లో పుట్టి ఉంటాడు. భీం సాధారణ శరీర సౌష్ఠవం, మామూలు ఎత్తు కలిగిన వ్యక్తి. ఆయన చదువుకున్నాడు. తెలుగు, ఉర్దూ రెండు భాషలు చదవడం, రాయడం ఆయనకు వచ్చు. గోండులు అతనిని ఎంతో గౌరవించేవారు. భీం వృత్తిరీత్యా రైతు. ఇతర రైతుల మాదిరిగా భూమినే నమ్ముకుని పగలు, రాత్రి శ్రమించేవాడు. భీం దైవభక్తి గలవాడు. గోండు దేవతలను నిత్యం పూజించేవాడు. ముస్లింల పట్ల ద్వేషం, వైరం ఎన్నడూ ప్రదర్శించేవాడు కాదు. తన తోటి గోండులలా భీం ఎన్నడూ అణగిమణిగి ఉండలేదు. అందుకే తగిన కారణం లేకుండా సిద్ధిఖీ దాడి చేసినప్పుడు దెబ్బకు దెబ్బ తీశాడు. భీం చేతిలో చావుదెబ్బలు తిన్న సిద్ధిఖీ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాళ్లకు పనిచెప్పాడు. అణచివేతకు లొంగే తత్వం భీంలో ఏ కోశానా లేదు. అందుకే అటవీశాఖ అధికారులు బాబాజరీలో గోండుల గుడిసెలకు నిప్పు పెట్టి, వారి పొలాలు ధ్వంసం చేసినప్పుడు భీం ఎదురు తిరిగాడు. భీం దూకుడుకు అటవీ శాఖ అధికారులు తోకముడవక తప్పలేదు. భీం మోచేతి నీళ్లు తాగే రకం కాదు. అవినీతి అధికారులను చూసి అతడు ఎన్నడూ బెదరలేదు.

> **భీం మూఢ నమ్మకాలను విశ్వసిస్తాడని అతడి గురించి ప్రచారం జరిగింది. భీం నాస్తికుడు కాదు. అతడు తన దేవుళ్లను భక్తి శ్రద్ధలతో పూజించేవాడు. తన తెగకు చెందిన అన్నిరకాల కర్మ- కాండలలోనూ పాల్గొనేవాడు. అయితే, అతనికి మూఢ నమ్మకాలు లేవు. యుద్ధానికి ముందురోజు, వందలమంది గోండులు గుమిగూడిన సభలో అతను ప్రసంగించాడు. పోరుకు ముందుకు దూకలేని పిరికివాళ్లు, ప్రాణ భయం ఉన్నవాళ్లు వెనక్కి తిరిగి వెళ్లిపోవచ్చని అందరిముందు కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు. భీం దగ్గర కొన్ని అతీంద్రియ శక్తులు, మంత్రశక్తులున్నాయని అతని గురించి కొమరం సూరు చెప్పిన కథలలో ఉన్నది. కానీ, అతని దగ్గర ఆ శక్తులున్నాయని అతని అనుచరులూ నమ్మలేదు.**

యుద్ధానికి ముందుకు కదులుతున్నప్పుడు, గోండులు తమని ఏదో మానవాతీత శక్తి ఆవహించి కదుపుతున్నట్టు కదులుతారు. అది ఒక రకమైన మంత్రంతో ముగ్ధులై ముందుకు కదిలినట్టు. దానివల్లే భీంకి అతీంద్రియ శక్తులున్నాయని వదంతులు వ్యాపించాయి. వీటిని పోలీసు కానిస్టేబుళ్లు కూడా నమ్మేవారు. 'నేను చావుకు సిద్ధపడే వచ్చానని' భీం ఎలుగెత్తి అరిచేవాడు. చేతిలో ఏ ఆయుధం లేకుండా కుమ్రం భీం నిజాం సైనికుల మీదికి యుద్ధానికి ముందుకు దూకాడని ఒక కథనం ఉంది. చేతిలో ఏ ఆయుధం లేకుండా భీం తమ వైపు సుడిగాలిలా దూసుకువచ్చాడన్నది పచ్చి అబద్ధం. భీం పుట్టుకతోనే యోధుడు. అతడు రాజగోండు. బాబాజరిలో భీం తన శత్రువుపై మెరుపుదాడి చేశాడు. ఇటువంటి గెరిల్లా తరహా దాడులు కేవలం కాకలు తీరిన యుద్ధవీరులే చేస్తారు. ఒక వీరుడు శత్రు సైన్యాన్ని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయడు. భీం కూడా అంతే. అందుకే ఇతర బలవంతులైన గోండుల సహాయ సహకారాల కోసం భీం తన దూతలను వారి దగ్గరికి పంపించినట్టు తెలుస్తున్నది. పంగడి రాజు దగ్గరికి వెళ్లి భీం దూతలైన జాకో, కుమారలింగ, భీం సందేశం వినిపిస్తారు. ప్రాణాలకు తెగించిన దాదాపు 500 మంది గోండులు చేతికి అందిన ఆయుధాలను తీసుకుని జోడెఘాట్‌కి రావడానికి కారణం భీం వాస్తవిక యుద్ధనీతి, అతనిలోని యోధుడి లక్షణాలు, గోండు రాజ్యం స్థాపించాలనే అతని ఆశయం తప్ప మరొకటి కాదు.



జోడెఘాట్‌లో యుద్ధం జరిగినరోజు గాని, లేక ఆ మరుసటి రోజు గాని కుమ్రం భీం వీర మరణం పొందాడు. ఆయన 1940 అక్టోబర్ 8న చనిపోయాడని ఒక అభిప్రాయం ఉంది. జోడెఘాట్‌లో జరిగిన యుద్ధం గురించి వివరాలు 1940 అక్టోబర్ 7న ముషీర్-ఏ-డక్కన్‌లో వచ్చాయని, హోమ్ సెక్రటరీ మహ్మద్ అజర్ హసన్ (Esq)కు అబ్దుల్ సత్తార్ రాసిన ఉత్తరంలో ఉన్నది. అంతకుముందు అక్టోబర్ 6న కాశీనాథరావు వైద్య, సిరాజుల్ తిర్మియాజీ, ఎం.నరసింగరావు, రామాచారి వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి ఆసిఫాబాద్ వెళ్లారు. అదే రోజు రాజకీయ నాయకులు, హిందూ ప్రజా మండలికి చెందినవారు కూడా వెళ్లారు. కాబట్టి, కుమ్రం భీం 1940 అక్టోబర్‌లో అమరుడయ్యాడనేది వాస్తవమే. కానీ, సరైన తేదీ 5వ తేదీ కంటే ముందే ఉంటుందనేది నా నమ్మకం.

(నేడు కుమ్రం భీం వర్ధంతి)

బీసీలపై కాంగ్రెస్ కప్పదాటు

బీసీ రిజర్వేషన్ల చుట్టే తెలంగాణ రాజకీయాలు తిరుగుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా స్థానిక సంస్థ